క్లుప్తంగా

మహిళా డిగ్రీ కళాశాలలో పీజీ ఇంగ్లిష్‌లో స్పాట్ అడ్మిషన్లు

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంఏ ఇంగ్లీషు కోర్సులో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి. సుబ్బలక్షుమ్మ తెలిపారు. ఏపీ పీజీసెట్-22లో అర్హత సాధించిన అభ్యర్థులకు జనవరి 4,5,6 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాల ఇంగ్లీషు విభాగాధిపతి డా. కె.వి.ప్రసాద్‌ను సంప్రదించాలని సూచించారు.

శ్రీ కాలభైరవస్వామి క్యాలెండర్ ఆవిష్కరణ

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో సోమవారం శ్రీ కాలభైరవస్వామి క్షేత్రం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రామాలయ చైర్మన్ డి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మగ్దూం సాహెబ్ కొట్టాలలోని శ్రీ ఇష్ట కామ్యార్థ కాలభైరవస్వామి క్షేత్రం గురించి బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులుమేరువ బాలాజీరావు ప్రచురించిన ఈ క్యాలెండర్‌ను స్థానిక భక్తులతో కలిసి ఆవిష్కరించారు.

నేడు నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం సమావేశం

కడప కార్పొరేషన్: ఏపీ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం సమావేశం మంగళవారం కడప మద్రాసు రోడ్డులోని నూర్జహాన్ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు గురుస్వామి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌తో పాటు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని నాయీ బ్రాహ్మణులంతా పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధురాలికి అన్నం ప్లేట్‌ను అందచేస్తున్న బాలఎల్లారెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ ఈఓ నాగమునిరెడ్డి

కడప కల్చరల్ : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, మానవతా సంస్థల సభ్యులు బాలయల్లారెడ్డి అన్నదానం చేశారు. తమ తండ్రి రిటైర్డ్ హెచ్‌ఎం కల్లూరు చిన్నయల్లారెడ్డి సంస్మరణగా స్థానిక నిర్మల వృద్ధాశ్రమంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉప విద్యాశాఖాధికారి ఉండేల నాగమునిరెడ్డి, జాస్తి మల్లికార్జునరావు, సిస్టర్లు, ఆస్పత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.

మినుము పంట పరిశీలన

కడప అగ్రికల్చర్: మినుముసాగులో జీబీజీ-1 రకంతో అధిక దిగుబడులను సాధించవచ్చని కృషి విజ్ఞానకేంద్ర ప్రధాన శాస్త్రవేత్త, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య సూచించారు. కేవీకే ద్వారా జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా జాతీయ సామూహిక క్షేత్ర ప్రదర్శన ద్వారా వల్లూరు మండలం పెద్దలేబాక గ్రామంలోని రైతు వెంకట సుబ్బయ్య పొలంలో సాగు చేసిన జీబీ జీ-1 మినుము పంటను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ మినుములో ఈ రకం పల్లాకు తెలుగు తట్టుకుని 70-75 రోజుల్లో ఎకరాకు 8 నుంచి 9 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుందన్నారు. అన్ని కాలాకు ఇది అనువైన రకం అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లావణ్య, సాయి మహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

రూట క్యాలెండర్ ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) ఆధ్వర్యంలో ముద్రించిన వాల్ క్యాలెండర్‌ను సోమవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాష తమ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. రూట వ్యవస్థాపక అధ్యక్షులు హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, డైరీ క్యాలెండర్ కమిటి చైర్మెన్ హాజీ అబ్దుల్ హామీమ్, కార్పొరేటర్లు అజ్మతుల్లాఖాన్, కమాల్‌బాష, జిలానీ, రూట రాష్ట్ర అసోసియేషట్ అధ్యక్షులు షాహిదుల్లా, సత్తార్‌ఫైజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్లు పంపిణీ

వీరపునాయునిపల్లె: మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో కొత్తగా మంజూరయిన లబ్ధిదారులకు మంగళవారం ఉదయం 10 గంటలకు పింఛన్ అందజేయనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం యస్ పాలగిరి సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని భారత్ మెడికల్ అండ్ క్లినిక్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వేల్పుల బాష ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు నూరిప ర్వీన్ పాల్గొని రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో సీఐ మంజునాథ్‌రెడ్డి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి, అధ్యక్షులు గంగాధర్‌రెడ్డి, కార్యదర్శి మల్లికార్జునరెడ్డి,నాగేంద్ర పాల్గొన్నారు.

ఎన్నికల హామీ మేరకు పెన్షన్ల పెంపు

- పలు డివిజన్లలో పెన్షన్ల పంపిణీలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ వారోత్సవాలు



వృద్ధురాలికి పెన్షన్ సొమ్ము అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సామాజిక భద్రతా పెన్షన్లమొత్తాన్ని పెంచారని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తెలిపారు. ఇప్పటి దాకా రూ.2500 ఇస్తున్న పెన్షన్ ప్రస్తుతం రూ. 2750లకు పెంచామని, రానున్న కాలంలో రూ. 3000 చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 62 లక్షలకు పైబడి పెన్షన్లు ఇస్తున్నామన్నారు. సోమవారం నగరంలోని 11వ డివిజన్ పరిధిలోని మృత్యుంజయ కుంట శివాలయంవద్ద కార్పొరేటర్ శ్రీలలిత, ఇన్‌ఛార్జి విజయభాస్కర్‌వర్మ, 27వ డివిజన్ గౌస్‌నగర్ వద్ద కార్పొరేటర్ జహీర్, 37వ డివిజన్ పరిధిలోని అగాడిలో కార్పొరేటర్ వాణి, ఇన్‌ఛార్జి బసవరాజు, 40వ డివిజన్ పరిధిలోని బిల్టప్ వద్ద కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు డిప్యూటీ సీఎం పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వలంటీర్, ప్రజాప్రతినిధి, కన్వీనర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి లేఖను లబ్ధిదారులకు చదివి వినిపించాలన్నారు. ఆర్థిక, కరోనా కష్టాలతో ఆదాయం లేకపోయినా ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి పలు పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో అనేక పెన్షన్లు తొలగించారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో అర్హతగల ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇస్తున్నామని, ప్రతి యేటా వెరిఫికేషన్ కోసం నోటీసులు జారీచేస్తున్నామే తప్ప పెన్షన్ తొలగించడం లేదని వివరించారు. ఈ విషయంలో ప్రజలుఎలాంటి అపోహలు, భయాందోళనలకు గురి కారాదన్నారు. 11వ డివిజన్‌లో నరసమ్మ అనేమహిళ తన కాలి ఆపరేషన్ జరిగి బెడ్‌రెస్ట్‌లో ఉన్నానని, 27వ డివిజన్‌లో అన్వర్ అనే వ్యక్తి తన ఇల్లు కాలిపోయిందని అంజద్‌బాష దృష్టికి తీసుకు రాగా ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున స్వంత నిధుల నుంచి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో కడప మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సయ్యద్ ఇబ్రహీం మియా,కార్పొరేటర్ షఫీ, నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ, మరియమ్మ, జహీర్ తదితరులు పాల్గొన్నారు.



నూతన పెన్షన్లను అందజేస్తున్న 45వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి అంకమ్మ



పింఛన్లను అందజేస్తున్న కార్పొరేటర్ విజయలక్ష్మి, ఐస్‌క్రీం రవి

పింఛన్‌దారులకు కొత్త సంవత్సర కానుక

కడప కార్పొరేషన్ : నూతన సంవత్సరంలో పింఛన్‌దారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త కానుక అందించారని 23వ డివిజన్ కార్పొరేటర్ టి.విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీమ్ రవి అన్నారు. సోమవారం నాగరాజుపేటలో జగనన్న ప్రభుత్వం పెంచి ఇస్తున్న రూ.2750 పింఛన్‌మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

45వ డివిజన్ పరిధిలో.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని 45వ డివిజన్ భగత్‌సింగ్ నగర్ సచివాలయంలో 14 నూతన పెన్షన్లను 45వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి అంకమ్మ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లను అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సచివాలయ వెల్ఫేర్ అధికారులు రఘు, రామాజనేయులు సచివాలయ అడ్మిన్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి మేలు చేసే సినిమాలు రావాలి

ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



క్లాప్ కొట్టి సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కల్చరల్ : ప్రస్తుత తరుణంలో సమాజానికి మేలు చేసే సినిమాలు రావాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. సోమవారం నగరంలో ఆయన శివహోం సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాల బారిన పడకుండా మంచి నడవడికతో ఉండాలని, సమాజాన్ని మేలు చేసే సినిమాలు నిర్మించాలని ఆయన సూచించారు. ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఈ సినిమా కడప వాసులు నిర్మిస్తుండడం అభినందనీయమన్నారు. కడప నగరంలోని ఆదిత్యారెసిడెన్సిలో జరుగుతున్న ఈ సినిమా షూటింగ్ పూర్తయ్యాక మంచి పేరు, లాభాలు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. నిర్మాత తిరుమలరెడ్డి డైరెక్టర్ అఖిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు తోట కృష్ణ, సుబ్బారెడ్డి, రఫీ, స్థానిక ప్రముఖులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్య విషయాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.కవిత



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి ఎస్. కవిత

కడప అర్బన్: ఖైదీల ఆరోగ్య విషయాలపట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత అన్నారు. సోమవారం కడపలోని కేంద్రకారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాలను జడ్జి కవిత తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఖైదీలతో, అధికారులతో న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానసిక వ్యాధితో బాధపడే ఖైదీల ఆరోగ్య విషయాలపట్ల డాక్టర్లు ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటూ ఉండాలన్నారు. ఖైదీల కుటుంబసభ్యులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు న్యాయ సలహాలు, సహాయం అందించడం లాంటి విషయాలను వివరించారు. కారాగారం పరిసరాలను పరిశీలించారు.మహిళా కారాగారంలో విడుదలవుతున్న మహిళా ఖైదీతో జడ్జి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేంద్రకారాగార డిప్యూటీ సూపరింటెండెంట్‌లు, జైలర్లు పాల్గొన్నారు.

లూర్దుమాత తిరునాల నిర్వహణ కమిటీ ఎన్నిక



తిరునాల నిర్వహణకు సమావేశమైన కమిటీ

కడప కల్చరల్ : స్థానిక మరియాపురంలోని లూర్దుమాత తిరునాల నిర్వహణ కోసం సోమవారం కమిటీని ఎన్నుకున్నారు. ఫిబ్రవరి 10, 11 తేదీల్లో జరగనున్న ఈ తిరునాల కోసం అన్ని విభాగాలు సమగ్రంగా పని చేసేందుకు ప్రత్యేకంగా కమిటీని ఎన్నుకున్నారు. విచారణ గురువు బిరుసు రాజా, సహాయ గురువు చంద్ర నిర్వాహకులుగా తిరునాల కమిటీ చైర్మన్‌గా జోసెఫ్‌ను ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా పుల్లగుజ్జు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పుల్లగూర లూర్దు, సహాయ కార్యదర్శిగా యన్నం ఆనంద్, కోశాధికారిగా ఉప్పలపాటి విజయ భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా నందిమండలం రాజు, ఎండీ ఆల్ఫోన్స్, నందిమండలం విజయరాజు, అల్లూరి జోజప్పలను ఎన్నుకున్నారు.

ప్రజా ఫిర్యాదులు వేగంగా పరిష్కరించాలి

కార్పొరేషన్ కమిషనర్



సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కడప సెవెన్‌రోడ్స్: ప్రజలు సమర్పించే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించి వాటిని సంబంధిత అధికారులకు పంపారు. అనంతరం నగర పాలక సంస్థలోని వివిధ శాఖాధిపతులు క్లర్కులతో సమావేశం నిర్వహించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా గడువులోపు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం మొత్తం 22 అర్జీలు వచ్చాయి.

కల్యాణ వైభోగమే!



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం హనుమప్పవీధిలోని నడివీధి గంగమ్మ ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం శ్రీ శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. నడివీధి గంగమ్మ క్షేత్ర నిర్వాహకులు గోపాల్‌సింగ్ ఆధ్వర్యంలో అర్చకులు విజయ్‌భట్టర్ బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించి అర్చకులు స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మహా మంగళ సూత్రాలను అలంకరించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

వైభవం.. వైకుంఠ దర్శనం



విశేష అలంకారంలో శ్రీ లక్ష్మీ సత్యనారాయణస్వామి

కడప నగరం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. గడ్డిబజారులోని శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం, జయనగర్ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, బీకేఎం వీధిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయం, శ్రీ సత్యనారాయణస్వామి ఆలయం, రవీంద్రనగర్‌లోని శ్రీ రామాంజనేయస్వామి ఆలయం, హౌసింగ్‌బోర్డు రామాలయం తదితర ఆలయాలలో భక్తులు వైకుంఠ ద్వారం నుంచి దైవ దర్శనం చేసుకున్నారు.



నేత్ర పర్వం వైకుంఠ ద్వార దర్శనం

వల్లూరు: వైకుంఠ ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించుకుని పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్తర ద్వార దర్శనానికి సోమవారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున అలంకార ప్రియుడైన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామికి, అభిషేక ప్రియుడైన సంతాన మల్లేశ్వర స్వామికి అభిషేకాలను నిర్వహించారు. చెన్న కేశవునితో బాటు, సంతాన మల్లేశ్వ స్వామి, లక్ష్మి దేవి మూలవిరాట్‌లకు వివిధ రకాల పూలతో పూలంగి సేవను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించడం విశిష్టతను సంతరించుకుని భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవిత్ర పెన్నా నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ వెంకటేశ్వర స్వామి అలంకారంలో గరుడ వాహనంపై కొలువు దీరి దర్శనమిచ్చిన శ్రీ చెన్నకేశవుని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకుని తరించారు.

బ్రహ్మోత్సవాలలో అక్షతదియ పర్వదినాన మాత్రమే గరుడ వాహనంపై కొలువుదీరి దర్శనమిచ్చే చెన్నకేశవ స్వామి చిన్న బ్రహ్మోత్సవంగా పిలిచే వైకుంఠ ఏకాదశి పర్వదినాన గరుడవాహనంపై దర్శనమివ్వడం ప్రత్యేకత సంతరించుకుంది. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

-మండలంలోని పలు గ్రామాలలో వైకుంఠ ఏకాదశి పర్వ దిన్నాన్ని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పెద్దపుత్తలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయ స్వామికి ఆకు పూజలు నిర్వహించారు. భజన కార్యక్రమాలను నిర్వహించారు. పైడికాలువలోని శ్రీ రాజ్య లక్ష్మీ చెన్న కేశవస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

పొలతలకు తరలివచ్చిన భక్తులు

పెండ్లిమర్రి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా పొలతల శైవ క్షేత్రానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా భక్తులు కోనేర్లల్లో స్నానాలు ఆచరించి శ్రీమల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్ రెడ్డిలు ప్రత్యేక చర్యలు చేపట్టారు.అలాగె వెల్లటూరులో చెన్నకేశవస్వామికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్పీకర్ సెట్ వితరణ

వల్లూరు: వల్లూరు మండల పరిధిలోని గంగాయపల్లెలో వున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రస్తుతం హైదరాబాదులో నివాసం వుంటున్న పాఠశాల పూర్వ విద్యార్థిని వంకదారి పంకజ కుమారి సుమారు 25 వేల రూపాయలకు పైగా విలువ చేసే ఆహుజా ట్రాలీ స్పీకర్ సెట్‌తో బాటుగా 10 ప్లాస్టిక్ కుర్చీలను వితరణగా ఇచ్చారు. వల్లూరుకు చెందిన వంకదారి మల్లయ్య కుమార్తె అయిన ఈమె 1974వ సంవత్సరంలో ఈ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకున్నారు. తాను చదువుకున్న పాఠశాలకు తన వంతుగా సహాయం అందించాలని భావించిన ఆమె స్పీకర్ సెట్‌ను, కుర్చీలను వితరణగా ఇచ్చారు. ఈ మేరకు స్థానిక పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాజీ ఉప సర్పంచ్ వంకదారి ఆంజనేయులు చేతుల మీదుగా వీటిని హెచ్‌ఎం గంగాధర్ నాయక్‌కు అందచేశారు.

బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అండేడ్కర్‌పై వాట్సాప్ గ్రూపులో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆర్.మనోహర్‌రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షురాలు కోటపాటి సుబ్బమ్మ, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు మాతయ్య, జాతీయ మనవ హక్కుల పరిపరక్షణ సమితి రాష్ట్ర అదనపు కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం వారు ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అట్లూరు మండలం కుంభగిరి గ్రామానికి చెందిన రొండ్లా మనోహర్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం వారు ఎస్పీకి వినతిపత్రమిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు జోష్వ, ఓబులపతి, చిన్న సుబ్బయ్యయాదవ్, నరసింహులు, జయవర్ధన్, నాగేంద్ర, శంకర్ పాల్గొన్నారు.

రాజోలి రిజర్వాయర్ సామర్థ్యం పెంచాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాజోలి రిజర్వాయర్‌ను 2.95 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రిజర్వాయర్ నిర్మాణానికి రూ.1300 కోట్లు కేటాయించినా ఇంతవరకు పనులు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే జిల్లాలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, కడప నియోజక వర్గ రైతాంగానికి సాగు నీటి ఉపయోగం ఉంటుందన్నారు. రాజోలి రిజర్వాయర్ సామర్థ్యం 1.20 టీఎంసీలకు తగ్గించాలనే ఆలోచనను వెంటనే విరమించుకొని 2.95 టీఎంసీలతో రిజర్వాయర్‌ను నిర్మించాలన్నారు. ఏపీ రైతు సంఘం నాయకులు కొమ్మద్ది ఈశ్వరయ్య, యానాదయ్య, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

హజ్ హౌస్‌కు కేర్ టేకర్‌ను నియమించాలి

కడప రూరల్ : కడప నగర సమీపంలో నిర్మించిన హజ్ హౌస్‌కు కేర్ టేకర్‌ను నియమించాలని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ విజయరామరాజుకు వినతి పత్రమిచ్చారు.

పేదలకు సాగు భూములు పంపిణీ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: గ్రామీణ పేద ప్రజలకు సాగు భూములు పంపిణీ చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రమిచ్చారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మనోహర్ రెడ్డి, నారాయణ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పాఠశాల విద్యా ఆర్‌జేడీ, డీఈఓ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట కృష్ణారెడ్డి, డీఈఓ దేవరాజు సూచించారు. కడప ఆర్‌జేడీ కార్యాలయంలో ఏపీటీఎఫ్‌కు సంబంధించిన క్యాలెండర్, డైరీని ఆర్‌జేడీ, డీఈఓలు ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాం సుందర్‌రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, గురవయ్య, కడప మండల అధ్యక్షుడు ప్రసాద్, సీకేదిన్నె అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, రమణ పాల్గొన్నారు.

ఆర్డీ, డీఎంహెచ్‌ఓలకు శుభాకాంక్షలు

కడప కార్పొరేషన్ : వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజులకు పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం వారిచాంబర్లలో వేర్వేరుగా కలిసి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలను చర్చించి పరిష్కరించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంబారపు అహరోన్, జిల్లా అధ్యక్షులు ఓబులేశు, జాయింట్ సెక్రటరీ మరియకుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ప్రేమలత, సత్యవతి, రామకృష్ణలు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ సేవలు అభినందనీయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ నగరాభివృద్ధికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జన వికాస్ సేవా సమితి అధ్యక్షులు ఎస్‌ఎండీ తాహీర్ తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తాహీర్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.